# గలగలా గోదారి

శ్రీరమణ

'వల్లప్పకి కూతురుట్టిందొదినా' అంది కావమ్మ మంచి నీళ్ళ చెరువుదగ్గర.

'ఎవరికీ, వల్లప్పకే!' అంది శేషమ్మ ఆశ్చర్యంగా.

"వల్లప్పకే వొదినా ఇప్పుడే చూసొస్తున్నాను. పిల్ల చాలాబావుందొదినా. గంధపు చెక్కలా శలాగ్గా వుంది"

"పోన్లే ఇంతకాలానికి దాని కడుపునో కాయ కాచింది. ఎన్ని నోములు నోచిందో, ఎన్ని మొక్కులు మొక్కిందో పాపం. కాపరానికొచ్చిన పధ్నాలుగేళ్ళకి, యిప్పటికి దాని కడుపు పండింది. ఆడపిల్లయితే నేవమ్మా.

"మరేమరే" అంది కావమ్మ.

"ఆపిల్లని చూసెళ్తానొదినా ఆయనకి మళ్ళీ దేవతార్చనకి ఆలశ్యమైపోతుంది."

వల్లప్పకి కూతురు పుట్టిందన్న వార్త వూరు వూరంతా గుబాళించింది. అందరూ వచ్చి చూసారు. చూసిన యావన్మందీ 'గంధపుచెక్కలా బావుందమ్మ' అన్నారు. ఆనందిస్తూ కొందరంటే ఉడుక్కుంటూ కొందరన్నారు. ఉదాశీనంగా కొందరన్నారు.

ఎవరేమనుకున్నా వల్లప్పకి గంధపు చెక్కలాంటి కూతురు పుట్టింది. మంచిగంధం ఒంటికి రాసుకున్నట్టుగావుంది.

ఆ గంధపు చెక్క అలాపుట్టిందిరానాన్నా. ఆ గంధపు చెక్కకి 'సీత' అని పేరుపెట్టుకున్నార్రా అమ్మా, బాబూను. ఆ సీత కుందనపు బొమ్మలా తిరుగుతూ గున గునమంటూ ఎదిగిందిరా.

ఆ సీత తండ్రి శివాలయంలో పూజారి. బుడిబుడి అడుగు లేసుకుంటూ తండ్రితోపాటు చెరువుకెళ్ళి, 'చివ చివా' అంటూ మూడో గట్టుమీదే నిలబడి మూడు మునకలూవేసి, బుడ్డి చెంబుతో నిండానీళ్ళు తీసుకుని, తండ్రి పక్కనే నడుస్తూ గుళ్ళోకెళ్ళి, మూడడుగులెత్తున్న రామలింగేశ్వరుడికి, తండ్రితోపాటుగా తండ్రి బుజమెక్కి 'ఓన్నమచివాయ' అంటూ అభిషేకం చేసేదిరానాన్నా. ఆ సీతతల్లిని నవ్వుతున్నప్పుడే తప్ప, ఏడుస్తూవుండగా ఎవరూ చూళ్ళేదురా. కిందపడి మోకాటిచిప్పలు కొటుకు పోయినా, 'పప్పోయానోచ్' అంటూ నవ్వేదిరా. ఆనవ్వెలావుండేదనీ మెత్తగా, పెదాలు విడీవడనట్టుగా వుండి, కళ్ళూ మొహమూ ఆ రామలింగడి గుళ్ళో అమ్మవారి వజ్రపు ముక్కెరలా వెలిగిపోతూవుంటే, మంచిగంధంలో గులాబీ అత్తరు రంగరించినట్టుగా వుండేదిరా. బొగడపూలుపరిచినట్టుగా వుండేదిరానాన్నా. సీతతల్లికి పదోయేడు ప్రవేశిస్తోంటే, తండ్రిని పాము కరిచిందిరా. అప్పుడు కూడా ఆతల్లి ఏడవలేదురా. 'ఏడవకమ్మా నాన్న శివభక్తుడామె. అందుకే, స్వయంగా శివుడి కంఠాభరణమే వచ్చి నాన్నని శివుడి దగ్గరకి తీసికెళ్ళిందమ్మా" అని తల్లికి తనే తల్లై, ఓదారుస్తూ చిన్నగా నవ్వించిరా కన్నతల్లి. అప్పుడూ అదే నవ్వురా నాన్నా.

అట్లతద్దయినా, గోకులాష్టమైనా, బొమ్మల నోమైనా, సుబ్బారాయుడి షష్ఠైనా హడావుడంతా సీతదేరా ఆ వూరు నందనవనమైతే, ఆ వనానికి గుబాళింపు సీత తల్లిదేరానాన్నా .

సీత తండ్రికి బదులుగా, శివాలయానికి పూజారిగా వచ్చిన ఒంటరి బ్రహ్మచారి రామలింగేశ్వర శాస్త్రితో, ఆ సీతక్క పెళ్ళి జరిపించేసారు నాన్నా, ఆవూర్లో పెద్దలందరూ కలిసి. ఆ సీతమ్మవారు ఉదేరిన నక్షత్రానికే ఈ సీతక్క కూడా ఉదేరిందిరా. ఓ శుభమూహూర్తంచూసి ఆ ముచ్చటకూడా జరిపించేశారునాన్నా. తనుపుట్టి పెరిగిన యిల్లే మధ్యలో నాసితప్పి, తిరిగి తనుమెట్టిన యిల్లవగా, తల్లి పెద్దదిక్కై నిలువగా, భర్తతో కాపరం పెట్టిందిరా సీతక్క.

కరణంగారి కూతురు పసర్తాడితే సీతక్కకే కబురొచ్చేది. మునసబుగారి కోడలికి సీమంతమవుతే పక్కన సీతక్కే వుండాలి. అవధానిగారి అమ్మాయికి పెళ్ళవుతే కాళ్ళకి పారాణి దగ్గర్నుంచి, బుగ్గన చుక్క, కళ్ళకి కాటుకా అలంకరణంతా సీతక్కే చెయ్యాలి. శాస్త్రిగారి కూతురికి పురుడొస్తే పిల్లాడికీ, తల్లికీ కూడా పురుటి స్నానం సీతక్కే చేయించాలి. ఆ వుర్లో ఏ శుభంజరిగినా, ఏ కార్యంజరిగినా సీతక్క వుండి తీరాలిరా నాన్నా. అప్పడాలొత్తాలన్నా, వడియాలు పెట్టాలన్నా, పెళ్ళిళ్ళలో పాటలు పాడాలన్నా సీతక్క లేనిదే జరగదురా. అట్లతద్దినాడు ఆటలన్నీ సీతక్కవేరా. రామలింగేశ్వరుడి గుడిలో స్వామి వారి కల్యాణంలో అమ్మవారి తరపున ఆధ్వర్యమంతా సీతక్కదేరా. కార్తీక దీపాల్లో తనే దీపమయి వెలిగేదిరా నాన్నా. బొడ్డూడని గుంటడి దగ్గర్నుంచి, పళ్ళూడిన తాతవరకూ అందరికీ ఆతల్లి, సీతక్కేరా.




అలా, సానమీద గంధపు చెక్కలా తిరుగుతూ, ఆ తల్లి పెరిగిందిరా. ముసలితల్లిని చూసుకుంటూ, తన రామలింగడికి కావలసినవన్నీ సమకూరుస్తూ, గుళ్ళో రామలింగడ్ని కొలుచుకుంటూ ఆస్వామి వరప్రదానంలా, తనస్వామి సేవా ఫలితంలా, వూరివారి ఆశీర్వచనంలా, గజనిమ్మపండులాంటి కొడుకుని కందిరా ఆ సీతమ్మతల్లి.

కొన్ని పువ్వులు పుట్టగానే పరిమళిస్తాయిరా. మరికొన్ని పుట్టగానే మత్తిభమిస్తాయిరానాన్నా. అదే జీవుల జీవితాల్లో విచిత్రం.

## మంచి గంధపు చెక్క

సీతమ్మ కన్నబిడ్డ పూర్ణచంద్రుడిలా వున్నా, అపశృతి (అపశృతేనా?) తప్పలేదురానాన్నా. వాడు పుట్టినప్పటి నుంచీ నోరు విప్పలేదురా. వాడి శరీరాన్ని చీల్చుకుంటూ ఎప్పుడూ ఒకటే శబ్దమొచ్చేదిరా. అదే ఆ ఆదిశబ్దం. అన్ని భాషలకీ, అన్ని భావాలకీ మూలశబ్దం. వాడు ఏడవగా ఎవరూ చూడలేదురా. తన నవ్వునంతటినీ మూటగట్టి, ఆ రామలింగేశ్వరుడికి ముడుపుకట్టి, వాడిని కందిరా ఆ సీతమ్మతల్లి.

లేగదూడ గంతులేస్తే వాడి ముఖం వెలిగిపోయేదిరా. చెరువులో కలువపువ్వు వికసిస్తే వాడి కళ్ళు కనక పుష్యరాగాలయ్యేవిరా. సీతాకోకచిలుక రెక్కలు విప్పి ఎగిరితే దానితో తనూ ఎగిరేవాడురా. పువ్వు పూసినా, కోకిల కూసినా, పసిపిల్ల పారాడినా వాడికి నవ్వే. శివుడికి అభిషేకం చేస్తున్నప్పుడూ వాడికి నవ్వే. రామలింగేశ్వరుడి కల్యాణంలో తలంబ్రాలు పోస్తున్నప్పుడూ వాడికి నవ్వే. పిల్లతెమ్మెర వీచినా, వరిచేలు వూగినా, జలజలా పున్నాగ పూలు రాలినా, శంఖధ్వనిలా 'ఓ ... ఓ ... ఓ ...' అంటూ ఒకటే నవ్వు. పల్లాలమ్మ తీర్థంలో డప్పుల శబ్దాన్ని మించి వాడినవ్వుల ఓంకారమే వినిపించేదనిరా. ఆ ఊర ఏశుభ కార్యం జరిగినా, నాదస్వరాన్ని దాటి వాడి ఓంకారహాసమే ,వినిపించేదిరా. గోచీ తప్ప మరో ఆచ్ఛాదన వాడి ఒంటిమీద ఎవరూ చూడ లేదరా. మారేడుచెట్టుమీదో, రామలింగేశ్వరుడి కోవెల శిఖరం మీదో క..ంచే వాడురా. లేదా 'ఓ ... ఓ ... ఓ ...' అంటూ కోనేటిలో ఈతకొడుతూ వుండేవాడురా. ఎప్పుడు ఆకలవుతే అప్పుడే ఎదురుగా ఏ ఇల్లుంటే ఆ

మూలశంకకు

త్వరగా

నమ్మకమైన

హెడన్సా

విరేపనముతో

చికిత్సను పొందండి

- శస్త్రచికిత్స

అవసరములేదు!




3 TG B



## ప్రకటన

ది.14.4.85 నుంచి ఆంధ్రజ్యోతి పబ్లికేషన్స్‌కు హైదరాబాదు పట్టణమునందు ఈ కింది వారిని ఏజంట్లుగా నియమించడమయినది. చందాదారులు, హాకర్లు పుస్తకముల విక్రయదారులు ఈ మార్పును గమనించగలరు.

అడ్రసు:

కనకదుర్గా న్యూస్‌ఏజన్సీస్,

40.నెం.4-1-528/4 అబిడ్సు,

హైదరాబాదు-500 001,

ఫోన్ నెంబరు 44723.



సినీ వార్తలకు జ్యోతిచిత్ర వారపత్రికనే చదవండి!!


యింట్లో దూరి చేతికందిందితినే వాడురా తండ్రి. ఏ యింట్లో ఎవరాపుతారు వాడివి. అన్నియిళ్ళు వాడివే కదరా నాన్నా.

సీతమ్మ బాధపడలేదురా ఆమె ముందు ఎవరూ బాధని వ్యక్తం చెయ్యలేదురా.

"నాకిక జన్మలేదర్రా. నేమా తరించడానికి కైలాసం వించి ఆ పరమశివుడే కిందికి దిగొచ్చాడు" అని మురిపెంగా నవ్వేదిరా ఆతల్లి.

అందుకేరా నాన్నా వూరంతటికీ ఆతల్లి సీతమ్మయింది. వూరంతా 'అమ్మా'అని విందుగా పిలిచింది.

ఏయింట ఏ శుభకార్య జరిగినా మెదటి తాంబూలం సీతమ్మదేరా. మెదటి పిలుపు సీతమ్మకేరా. ఆవూరి ఆడపడుచులంతా, సీతమ్మ చేతిమీదుగా పండంటి బిడ్డల్ని అందుకున్నవారేరా నాన్నా. ఏనోము పట్టినా మొదటి వాయినం సీతమ్మకే. పెళ్ళిళ్ళలో పసుపుదంచాలంటే మొదటి పోటు సీతమ్మదే. పూలజడ కుట్టాలంటే సీతమ్మేరావాలి. శోభనం గది సీతమ్మే అలంకరించాలి. వంట దగ్గర్నుంచి అజమాయిషీ అంతా సీతమ్మదేరా నాన్నా.

అప్పటికీ, ఇప్పటికీ ఆ సీతమ్మ గంధపు చెక్కలా అలాగే వుందిరా నాన్నా.

తన రామలింగడికి పక్షవాతమొచ్చినా ఆ సీతవ్వకంట, చుక్క మెరవలేదురా. వజ్రపు తునకలా నవ్వు మెరిసిందిరా.

"పరిపూర్ణంగా భర్తని సేవించుకునేయోగం, అడిగితే వస్తుందా అమ్మలూ" అందిరా ఆసీతవ్వ. ఆ రామలింగేశ్వరుణ్ణి ఈ రామలింగడిలోనే చూసుకుంటూ సేవించుకుందిరా. 'దేవీ' అవలేదురా నాన్నా. ఎందుకవాలిరా వూరంతా తానే అయినప్పుడు.

ఆఖరికి తన రామలింగడి నోట్లో తులసి తీర్థం పోస్తున్నప్పుడు కూడా కదిలొచ్చిన వూరంతటినీ చూసి నిండుగా నవ్విందిరా సీతవ్వ. "నాస్వామికి పిలుపొచ్చింది. ఆఖరు సారిగా సెలవు తీసుకుంటానర్రా"అని నుదుట నిండుకుంకుమ బొట్టు అమ్మవారి మాంగల్యంలా మెరుస్తూ వుంటే, భర్త పాదాల మీద తలవాల్చిందిరా సీతవ్వ.

అంతేరా నాన్నా. అంతే, అప్పుడు కూడా మంచి గంధంలా ముఖమంతా నవ్వుల పరిమళమేరా. •

